క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం బీజేపీ మండల అధ్యక్షురాలు చన్నాపురి లావణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గొల్లవాడ, జక్కాపూర్, లోనవెల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు నేరెళ్ల అశోక్, నులిగొండ మహేశ్, రాచర్ల మహేశ్, ఎల్ములే శంకర్, జాబర్ మారుతి, బాలాజీ, రంగన్న, దివాకర్, భగవాన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): మండలంలోని డోర్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం మధుకర్ కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ మండల సభ్యుడు దుర్గం మధుకర్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి కాగజ్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ నాయకుడు దుర్గం మధుకర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అస్లాం బిన్ అబ్దుల్లా, పనసా లక్ష్మణ్, ఎల్ములే నందాజీ, దుర్గం భరత్, దుర్గం వికాస్‌రాజ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

కెరమెరి: ఉపాధి హామీ పథకంలో పనులు ప్రారంభించాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని పాటాగూడ, పాట్నాపూర్ గ్రామాల్లో గిరిజన ఆదివాసీలతో మాట్లాడారు. గతేడాది కొద్ది రోజులే పనులు చేశారని, ఈ ఏడాది ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. రానున్న రోజుల్లో మారుమూల గ్రామాల్లో కూలీ పనులు లభించని క్రమంలో ఉపాధి ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీ రోజు ఉపాధి పనులకు వెళ్లాలన్నారు. ఈజీఎస్ టీఏ నాగోరావు, గ్రామ కార్యదర్శి జాడి పెంటు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవకార్ మహామంత్ర దినోత్సవం



మహామంత్రం జపిస్తున్న జైనులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జైన దేవాలయంలో బుధవారం జైనులు ప్రపంచ నవకార్ మహామంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నవకార్ మహామంత్రం జపించారు. సమాజ శ్రేయస్సు, శాంతికోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తారని వారు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగించవద్దు



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

నార్నూర్: ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంపీవో సాయిప్రసాద్‌లు అన్నారు. బుధవారం ప్లాస్టిక్ వాడకంపై అంగడీ బజార్‌లో వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వద్దేవద్దని వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన మానవులకి అనేక నష్టాలు కలుగుతాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలుష్యం, జీవవైవిధ్యం క్షీణించడం, నీరు, ఆహారం కలుషితం కావడం వాతావరణ మార్పులు, ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం వ్యాపారస్తులకు ఉచి తంగా కాటన్ కవర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోతిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

జర పదిలం..!

- పిల్లలపై కన్నేసి ఉంచండి
- చెరువులు, వాగులు, బావుల్లో ఈత సరదా
- ప్రమాదాలకు గురవుతున్న చిన్నారులు



పెద్దవాగులో ఈత కొడుతున్న చిన్నారులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఇళ్లకు చేరుకున్నారు. పిల్లలు సరదాతో పాటు వేసవి తాపం తీర్చుకునేందుకు సమీపంలోని వాగులు, చెరువులు, బావుల్లో ఈతకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులు పిల్లల కదలికపై ఓ కన్నేసి ఉంచితే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు.అదే విధంగా సెలవుల్లో అధికంగా పిల్లలు సెల్‌ఫోన్ చూడడం వలన కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

నీటికి దూరంగా..

నియోజకవర్గంలోని అడా ప్రాజెక్ట్, వట్టివాగు, చెలిమెల, పెద్దవాగులకు ఎండాకాలం ముఖ్యంగా యువకులు సరదాకోసం ఈతకు వెళ్తుంటారు. సరదాగా స్నానాలు చేస్తుంటారు. లోతు తెలియక ప్రాణాలను కోల్పోతున్నారు. కాగా కొంత మంది బావుల్లో కూడా ఈతకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. ప్రమాదాలు సంబవించే స్థలాల్లో సంబంధిత అధికారులు పలు సూచికలు అమర్చినా.. అత్యుత్సాహంతో వెళ్లడంతో ప్రమాదాలను కోరి తెచ్చుకొంటారు.

సరదా ప్రాణాల మీదకు..

ఇది వరకే పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నారు. సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్తుంటారు. అయితే ఈతకు వెళ్లిన సమయంలో పెద్దలు లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. జిల్లాలోని పలు మండలాల విద్యార్థులు, యువకులు సమీపంలోని వాగులు, రిజర్వాయర్లు, బావులు, చెరువుల్లో ఈతలకు వెళ్తున్నారు. ఈ సమయంలో వారు ఎలాంటి రక్షణ చర్యలు కానీ, పెద్దలను వెంట తీసుకవెళ్లడం కానీ చేయడం లేదు. పిల్లలను బయలకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యతు తల్లిదండ్రులపై ఉందని పలువురు సూచిస్తున్నారు.

పిల్లలపై శ్రద్ధ పెట్టాలి

చిన్న పిల్లలకు తల్లిదండ్రులు ఎలాంటి వాహనాలు ఇవ్వొద్దు. అలాగే రిజర్వాయర్లు, వాగులు, చెరువులో ఈతకు వెళ్లకుండా తల్లదండ్రులు కంట కనిపెడుతూ ఉండాలి. ఇలా పిలలకు వేసవిలో చాలా ప్రమాదాలు జరుగుతుంటాయి. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి.

– బుద్దె రవీందర్, ఆసిఫాబాద్

రాంజీగోండు ఆశయ సాధనకు కృషి చేయాలి



రాంజీగోండ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



తిర్యాణిలో.

ఆసిఫాబాద్: దేశ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు మర్సుకోల రాంజీగోండు 165వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలోని రాంజీగోండు చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంజీగోండు వారసులు మర్సుకోల తిరుపతి, రాయిసెంటర్ జిల్లా కోషాధికారి కుడ్మెత మారుతితో పాటు ఆదివాసీ నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీసీడీవో జిల్లా అధికారిణి శకుంతల, గోండు ఉద్యోగులు సిడాం మధూకర్, జల్పతి రావు, కుడ్మెత బాదిరావు, గోడం జగన్నాథ్, కొట్నాక సుభాష్, తొడసం సేనేరావు పాల్గొన్నారు.

తిర్యాణి: రాంజీగోండు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నాక ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాంజీగోండు వర్ధంతిని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీలలో అనేక మంది ఉద్యామకారులు ఉన్నారని వారిలో రాంజీగోండు ప్రత్యేకమన్నారు. బ్రిటీష్ వారికి కంటి మీద కునుకు లేకుండా చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, నాయకులు రుక్మిణీ, గేడం జనార్దన్, వెద్మ భగవంత్ రావు, గేడం శుభాష్, అశోక్ పాల్గొన్నారు.

కెరమెరి: ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన ఆదివాసీ తొలి ఉద్యమకారుడు రాంజీగోండు వర్ధంతిని పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్యారాంవు పటేల్ సేవా సమితి వ్యవస్థాపకుడు పెందోర్ శ్రీనివాస్, కినక సకారాం, కుడ్మెత భీంరావు, ఆత్రం భీంరావు, ఆడ శ్రీనివాస్, మెస్రం వసంత్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

రెబ్బెన: హన్మకొండలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సింగరేణి ఉద్యోగులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో ఆవిర్భవించిన బీఆర్ఎస్, అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు అందించిందన్నారు. సింగరేణిలో సుమారు 20వేల మంది ఉద్యోగులకు కారుణ్య నియామకం ద్వారా వారి వారసులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సుమారు 5వేల మందికి కొత్తగా ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. వారంతా తమ అభిమానాన్ని చాటి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధారావత్ మంగీలాల్, సెంట్రల్‌కమిటీ నాయకులు సమ్మయ్య, ఏరియా కార్యదర్శి సంతప్, పిట్ కార్యదర్శులు రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి’



మాట్లాడుతున్న కొలిపాక కిరణ్ కుమార్

రెబ్బెన: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల బూత్‌స్థాయి క్రియాశీల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్రమోడీ దేశానికి అందించిన సేవలతో పాటు ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వెళ్లినప్పుడే ప్రభుత్వ పనితీరు ప్రజలకు అర్థమవుతుందన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణకుమారి, జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్, మండల కన్వీనర్ పసుపులేటి మల్లేశ్, నాయకులు తులసీరాం, రాజిరెడ్డి, మధుకర్, నవీన్, సునీల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొత్త సీసీరోడ్లు

- మండలానికి రూ.కోటి 85లక్షల నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరయ్యాయి. దీంతో పంచాయతీల్లోని అంతర్గత దారులు సీసీరోడ్లతో మెరిసి పోతున్నాయి. బురదమయంగా ఉన్న అంతర్గత రహదారులకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించడంతో గ్రామాల్లో అంతర్గత రహదారుల దశ మారింది. మండలంలో 12 గ్రామపంచాయితీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ. కోటి 85లక్షల నిధులను మంజూరు చేశారు. పనులను దక్కించుకున్న గుత్తేదారులు గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

మండలానికి..

మండలంలోని దరోగపల్లి గ్రామానికి రూ.10లక్షలు, చేడ్వాయి గ్రామానికి రూ.35లక్షలు, పోతెపల్లి గ్రామానికి రూ. 25 లక్షలు, గొంట్లపేట్ గ్రామానికి రూ. 10లక్షలు, ఎల్కపల్లి గ్రామానికి రూ. 70లక్షలు, కొండపల్లి గ్రామానికి రూ.15లక్షలు, ఎల్లూర్ గ్రామానికి రూ.5లక్షలు, లోడుపల్లి గ్రామానికి రూ.5లక్షల నిధులను మంజూరు చేశారు. పంచాయతీల్లో అధ్వానంగా ఉన్న, బురదమయంగా ఉన్న రోడ్లపైన సీసీ వేస్తుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడ్డాం..



కాలనీలోని రహదారి గుంతలమయంగా మారడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో నూతన సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం ఆనందంగా ఉంది.

– అజ్మీర రమేశ్, ఎస్టీ కాలనీ, ఎల్కపల్లి

బురద సమస్య లేదు..



గంగపుత్రుల కాలనీలో వర్షాకాలం వచ్చిందంటే బురదతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కాలనీలో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేయడంతో బురద సమస్య తీరింది.

– గిరుగుల మల్లేశ్, గంగపుత్రుల కాలనీ, గొంట్లపేట్

చలివేంద్రం ప్రారంభం



తాగునీరు అందజేస్తున్న ఎంపీడీవో



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏఎస్సై పోశెట్టి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సిర్పూర్(టి) గ్రామపంచాయతీ తరపున వేసవిలో ప్రయాణికులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. బస్టాండ్ ప్రాంతంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు, వ్యాపార సముదాయాలకు వచ్చే స్థానికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందయనిమని కౌటాల తహసీల్దార్ పుష్పలత అన్నారు. బుధవారం కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండుతుండడంతో ప్రజలు అత్యవసర పనులుంటేనే బయటకు వెళ్లాలని సూచించారు. ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, ఎంపీవో మహేందర్, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

ఆసిఫాబాద్: ఇటీవల జిల్లా మైనార్టీ సంక్షేమం అధికారి నదీం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఉబేద్‌బిన్ యాహియా, మీర్ సాబిర్ అలీ, అబ్దుల్ ముబషీర్, ఎజాజ్ హైదర్, ముస్తఖీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అంజల్‌కుమార్ తెలిపారు. రవీంద్రనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

రెబ్బెన: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో నుంచి రాగి తీగను చోరీ చేసిన కేసుల్లో మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన పుప్పాల ప్రసాద్, పుప్పాల అంజన్న అనే ఇద్దరు నిందుతులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 15వేల జరిమాన విధిస్తూ బుధవారం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేశ్ తీర్పునిచ్చారు. మండలంలోని రోళ్లపాడు, ఇందిరానగర్, తుంగెడ, రాంపూర్, గంగాపూర్ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును చోరీ చేయడంతో విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి ఇచ్చిన పిర్యాదు మేరకు అప్పటి ఎస్సై దీకొండ రమేశ్ కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పర్చారు. ప్రస్తుత రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లు కేసుకు సంబంధించిన సాక్షులను కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 15వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వామ్మో విద్యుత్ బిల్లు



విద్యుత్ బిల్లు చూపిస్తున్న రత్నాకర్

కెరమెరి: విద్యుత్ అధికారులు నిర్లనిర్లక్ష్యమో.. విద్యుత్ మీటరు సాంకేతిక కారణమో తెలియదు కానీ.. ఒక వ్యక్తికి విద్యుత్ బిల్లు చుక్కలు చూపిస్తుంది. నాలుగు నెలలుగా విద్యుత్ బిల్లు రూ. 48,793 రావడంతో అవాక్కైయ్యాడు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటిస్తుంటే మరోవైపు విద్యుత్ బిల్లులు ఇలా రావడంతో సదురు వినియోగదారుడు ఆందోళన చెందుతున్నాడు. మండల కేంద్రానికి చెందిన దర్దె రత్నకుమార్ రేకుల ఇల్లు ఉంది. అందులో నాలుగు ప్యాన్లు, ఒక కూలర్, నాలుగు బల్బులు ఉన్నాయి. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. ఈనెల 8న విద్యుత్ సిబ్బంది వచ్చి బిల్లు తీయడంతో ఏకంగా రూ.48,794 వచ్చింది. దీంతో వినియోగదారుడు షాక్ గురైయ్యాడు. ఒకేసారి ఇంత పెద్దమొత్తంలో బిల్లు రావడంతో లబోదిబోమంటున్నాడు. 20 నవంబర్ 2024న రత్నాకర్ విద్యుత్‌బిల్లు రూ. 55 వేలు చెల్లించాడు. అయినప్పటికీ పెద్ద మొత్తంలో బిల్లు రావడమెంటని ఆందోళన చెందుతున్నాడు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్‌లాల్

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకంలో దరఖాస్తులు చేసుకొని ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో జవహర్‌లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎంబీసీ, మైనార్టీల కుటుంబాలకు చెందిన యువతీ, యువకులు స్వయం ఉపాధి, ఆర్థిక, స్వావలంబన, సుస్థిర ఆర్థిక అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అర్హులైన వారు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకొని ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ అర్జున్ పాల్గొన్నారు.

‘ఎన్నికల్లో సత్తా చాటాలి’



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పార్టీ గ్రామంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు., బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ప్రజల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, సందీప్, దిలీప్, కార్తీక్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.